ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో కూచిపూడి ప్రదర్శన చేస్తున్న కళాకారులు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ నృత్యోత్సవం సందర్భంగా ఆదివారం అభినయావని నృత్యానికేతన్ నాట్య గురువు చావళి బాల త్రిపురసుందరి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. గణేశకౌతం, వందే మహేశ్వరం, వసంత స్వరజతి, నారాయణతే, రామాయణశబ్దం, భావయామి, తిల్లాన తదితర అంశాలను కళాకారులు సంజన, అనురిత, సహన, యజ్ఞ, ప్రియసిని, చైత్రహాసిని, సౌమ్య, సంయుక్త, శశికళ, వైష్ణవి, మృత్యుంజయశర్మ, సర్వాణిలు ప్రదర్శించి అలరించారు.

ఆదరించండి.. అండగా ఉంటాం !





కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

హఫీజ్‌పేట్: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆదరిస్తే తామంతా అండగా ఉంటామని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ కాలనీలో ఇమ్రాన్ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నామని, తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి ..

హఫీజ్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం తరఫున కాలనీల్లో నెలకొన్న అన్ని రకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని అపర్ణ గేటెడ్ కమ్యూనిటీలో కాలనీ అసోసియేషన్ సభ్యులతో అల్పాహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హస్తం గుర్తుకు ఓటువేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కమ్యూనిటీలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. కార్పొరేట్ శక్తుల కోసమే బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెదక్‌లో బీఆర్‌ఎస్ జెండా ఎగరేస్తాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రామచంద్రాపురం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మెదక్‌లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి తెల్లాపూర్‌లో మున్సిపాలిటీ ముఖ్యనేతలతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 30న బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించే ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాప్రతినిధులు, ప్రతి వార్డు నుంచి ముఖ్య నేతలు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, కౌన్సిలర్లు లచ్చిరాం నాయక్, బాలాజీ పాల్గొన్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు

పటాన్‌చెరు: సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విమర్శించారు. ఆదివారం సాయంత్రం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ బాలాజీ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన అమీన్‌పూర్ మున్సిపల్, మండల మెదక్ లోక్ సభ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. కరువు కాటకాలతో తల్లడిల్లిన రాష్ట్రంలో గోదావరి జలాలు తీసుకొచ్చి నీటి గోస తీర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. నిత్యం నీటి ఇబ్బందులు ఎదుర్కొనే అమీన్‌పూర్‌కు మిషన్ భగీరథ ద్వారా మంచి నీటిని అందించారన్నారు.

'బీజేపీతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి'

బీజేపీ ఇంటింటి ప్రచారం



ప్రచారంలో విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి అనితారెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ గోపీనగర్‌లో ఇంటింటికి వెళ్లి బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికే ఓటు వేయాలని కోరుతూ.. ఆదివారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకులు నీరటి చంద్రమోహన్ మాట్లాడుతూ.. బీజేపీతోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశంలో బీజేపీ 400 ఎంపీ సీట్లు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎక్కడికి వెళ్లినా బీజేపీ శ్రేణులకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. పార్టీ నాయకులు శంకర్, నర్సింహ్మా, చంద్ర, విఠల్, జంగయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

టెలికామ్‌నగర్‌లో..

రాయదుర్గం: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో గచ్చిబౌలి డివిజన్ టెలికామ్‌నగర్‌లో బీజేపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండావిశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ.. బీజేపీ నేతలు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలో బీజేపీ గెలుపు ఖాయమని, మెజార్టీ ఎంతనేది చూస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు ఈసారి బీజేపీని గెలిపించాలని నిర్ణయించుకున్నారని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి, స్థానిక నాయకులు దినేష్‌యాదవ్, రవీందర్, ప్రవీణ్, వెంకటేష్, మురళి, రవి పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతు ఇవ్వాలి..

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీ అందించాలని ఆదివారం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి అనితారెడ్డి కోరారు. హైదర్‌నగర్ డివిజన్‌లోని మిత్రహిల్స్‌లో ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విశ్వేశ్వర్‌రెడ్డికి స్థానిక సమస్యలు, అభివృద్ధిపై అవగాహనతో పాటు స్పష్టమైన ప్రణాళిక ఉందన్నారు. సందీప్‌రెడ్డి, నాయకులు సీతారామ రాజు, కమలాకర్, సుబ్బారావు, వెంకటేశ్వర్ రావు, కుమార్, రమేష్ పాల్గొన్నారు.



గోపీనగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నేత చంద్రమోహన్



ఓటర్లకు కరపత్రాలను అందిస్తున్న బీజేపీ నేతలు

జ్యువెలరీ ప్రారంభోత్సవం



జ్యువెలరీ స్టోర్‌ను ప్రారంభిస్తున్న టీవీ యాంకర్ శ్రీముఖి

మియాపూర్: మదీనాగూడలో స్వర్ణమాల జ్యువెలరీ ప్రారంభోత్సవంలో ప్రముఖ టీవీ యాంకర్, నటీ శ్రీముఖి సందడి చేశారు. ఆదివారం ఆమె స్వర్ణమాల జ్యువెలరీ డైరెక్టర్ మహేష్‌కుమార్, దశరథ్, రాహుల్‌తో కలిసి జ్యువెలరీ స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీముఖి మాట్లాడుతూ.. స్వర్ణమాల జ్యువెలరీలో వైవిధ్యం, నాణ్యతతో కూడిన అన్ని రకాల ఆభరణాలు అమితంగా ఆకట్టుకున్నాయన్నారు. కస్టమర్లకు నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని నిర్వాహకులు తెలిపారు.

సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: క్రెడిట్ కార్డ్ అప్డేట్ అంటూ సైబర్ మోసానికి గురైన బాధితుడు నగదు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్‌కు చెందిన వ్యక్తికి మార్చి 28న క్రెడిట్ కార్డ్ అప్డేట్ చేయాలని బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని చెప్పాడు. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా చేసి తన ఫోన్‌కు వచ్చిన ఓటీపీని చెప్పాడు. వెంటనే అతని ఖాతాలో ఉన్న నగదు రూ.35 వేలు నగదు డెబిట్ అయినట్టు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైమ్ పోలీసులకు, అనంతరం అమీన్‌పూర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కల్వరి టెంపుల్‌లో ప్రత్యేక ప్రార్థనలు

పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులు



డాక్టర్ రంజిత్‌రెడ్డి, పట్నం సునీతామహేందర్‌రెడ్డి తదితరులు

హఫీజ్‌పేట్: మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌లో చేవెళ్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు డాక్టర్ రంజిత్‌రెడ్డి, పట్నం సునీతామహేందర్‌రెడ్డిలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వరి టెంపుల్ వ్యవస్థాపకులు సతీష్‌కుమార్ వారితో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కోసం ప్రతి ఒక్కరూ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి నియోజకవర్గాల ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, బండి రమేష్‌లు బ్రదర్ సతీష్‌కుమార్‌తో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన



మైహోమ్ భుజాలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: పోలింగ్ శాతం పెంపునకు అధికారులు చేసే ప్రయత్నానికి ఓటర్లంతా సహకరించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని బయోడైవర్సిటీ పార్కు ప్రాంతంలోని మైహోమ్ భుజాలో స్వీప్, జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటుహక్కు ఉన్న వారంతా విధిగా తమ హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేస్తేనే ప్రజాస్వామ్య లక్ష్యం నెరవేరుతుందన్నారు. నగరాల్లో ఓటింగ్ శాతం తగ్గుతుందనే ఆందోళన అందరిలోనూ వస్తుందని, దీనికి భిన్నంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలంతా తమ ఇరుపొరుగు వారిని ఓటువేసేలా ప్రోత్సహించాలన్నారు. జీహెచ్‌ఎంసీ యూసీడీ అదనపు కమిషనర్ డాక్టర్ సీఎస్‌రాజు, ఫెసిలిటీ మేనేజర్ అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులు, గేటెడ్ కమ్యూనిటీవాసులు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు ఉచిత మెగా వైద్య శిబిరం



వ్యాధులపై అవగాహన కల్పించిన రామ్‌దేవ్‌రావ్ ఆసుపత్రి సీఈఓ డా. యోబు

ఆల్విన్‌కాలనీ: సమాజానికి సేవ చేయటంలో రామ్‌దేవ్‌రావు హాస్పిటల్ నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది. ఇందులో భాగంగా ఆదివారం చిన్న పిల్లలకు సంబంధించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో చిన్న పిల్లలకు వచ్చే పలు సమస్యల గురించి, కాలానుగుణమైన వాతావరణంలో వచ్చే మార్పులు వల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ గురించి 9 నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ క్యాంపులో రామ్‌దేవ్‌రావ్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. కమలాకర్, పిల్లల వైద్య నిపుణురాలు డా. పి. భవాని దివ్య, డా. విజయానంద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 600 మందికి వైద్య పరీక్షలు, కంటి పరీక్షలు చేశామని హాస్పిటల్ సీఈఓ డా. యోబు తెలిపారు.

వేదిక్ మ్యాథ్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పీఎస్‌ఎం స్కూల్‌లో జరిగిన విశ్వం ఎడ్యుటెక్ అబాకస్, వేదిక్ మ్యాథ్స్ జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు నాలుగు రాష్ట్రాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలోల వెయ్యి మంది విద్యార్థులు పోటీలకు హాజరు కాగా 115 మంది జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. ఆదివారం జరిగిన పోటీలో 28 మంది విద్యార్థులు విజయం సాధించారు. ఈ పోటీలో పాల్గొన్న విద్యార్థులకు యాజమాన్యం 5 లక్షల విలువైన స్కాలర్‌షిప్, బహుమతులను అందజేశారు. పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన 14 మంది విద్యార్థులకు 14 మంది విద్యార్థులకు 5 వేలు, ఇతర బహుమతులు అందజేశారు. బెస్ట్ పెర్‌ఫార్మర్‌గా నిలిచిన 14 మంది విద్యార్థులకు 2 వేలు నగదు బహుమతి అందజేశారు. పోటీలో పాల్గొన్న వారందరికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. విజేతలకు విశ్వం ఎడ్యుటెక్ సీఈఓ. హరిచరణ్ బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో విజ యం సాధించిన 28 మంది విద్యార్థులు అక్టోబర్ 2024లో జరిగే అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనటానికి అర్హత సాధించారని తెలిపారు.

సొంత గూటికి గిరిజన నాయకులు



ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో చేరిన గిరిజన నాయకులు

జహీరాబాద్ టౌన్: బీఆర్‌ఎస్‌లో గతంలో పని చేసి ఆ తరువాత బీజేపీలో చేరిన గిరిజన నాయకులు తిరిగి సొంత గూటికి చేరారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ సమక్షంలో మొగుడంపల్లి మండలం గౌసాబాద్ తండాకు చెందిన తాజా మాజీ సర్పంచ్ సంజీవ్ రాథోడ్, డిప్యూటీ సర్పంచ్ జాను రాథోడ్ మరికొంత మంది ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. రిజర్వేషన్లు ఎత్తి వేస్తామని బీజేపీ నాయకులు పేర్కొనడంతో సొంత గూటికి వచ్చామని గిరిజన నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి దేవిప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు సంజీవ్‌రెడ్డి, గోపాల్, సంజీవ్ పవార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆయుధం

- వేసవిలో తరచూ అగ్నిప్రమాదాలు
- నిర్లక్ష్యంలో రసాయన పరిశ్రమల యాజమాన్యం



గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాద దృశ్యం (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): రసాయన పరిశ్రమల్లో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. . అప్రమత్తంగా లేకపోవడంతో కోట్ల రూపాయల ఆస్తి నష్టంతోపాటు విలువైన కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. పరిశ్రమల యాజమాన్యం నియమ నిబంధనలు పాటించకపోవటంతో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎండాకాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

◆ పటాన్‌చెరువు పాశమైలారం, జహీరాబాద్, హత్నూర, జిన్నారం, గుమ్మడిదల, ఖాజీపల్లి, బొల్లారం, గడ్డపోతారం, గుమ్మడిదల, అనంతారం, బొంతపల్లి పారిశ్రామిక వాడల్లో వెయ్యి వరకు రసాయన పరిశ్రమలు ఉంటాయి. వీటిల్లో 50 శాతానికి పైగా చిన్నతరహా పరిశ్రమలు ఉంటాయి. ఈ పరిశ్రమల్లో ఇంటర్మీడియట్ రసాయన ఉత్పత్తులు తయారు చేస్తుంటారు. చిన్న పరిశ్రమల్లో తగిన రక్షణ పరికరాలు లేకపోవటంతో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాద సమయంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు ఘటనా స్థలానికి రావటం లేదు. అగ్నిప్రమాదం జరిగిన తరువాత రోజు వచ్చి పరిశీలించటం ఆనవాయితీగా మారింది. ప్రమాదం జరుగుతున్న సమయంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించేందుకు ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. దీంతో జరగాల్సిన ప్రాణ, ఆస్తి నష్టం జరిగిపోతుంది. దీంతో పారిశ్రామిక వాడల్లోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

అధికారుల చర్యలు నామమాత్రం

రసాయన పరిశ్రమలోకి ప్రవేశించి, బయటకు వచ్చే వరకు ప్రతిక్షణం రక్షణ చర్యలు అవసరం. చిన్న తరహా పరిశ్రమల్లో ఇలాంటివేవి కనిపించవు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారుల కనుసన్నల్లో రక్షణ చర్యలు ఉండాలి. ప్రమాదం జరిగినప్పుడు పోలీసులే అందుబాటులో ఉండి చర్యలు తీసుకుంటున్నారు. అధికారులు మాత్రం ఎవరూ కనిపించడం లేదు. వారి నిఘా పరిశ్రమలపై ఉంటే కొంత వరకు ప్రమాదాలు నివారించవచ్చు.

అందుబాటులో లేని అగ్నిమాపక కేంద్రాలు

పారిశ్రామిక వాడల్లో అగ్నిమాపక కేంద్రాలు లేకపోవటంతో ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువ నష్టం జరుగుతుంది. గుమ్మడిదల, జిన్నారం మండలాల్లోని పారిశ్రామిక వాడల్లో ఏమైనా ప్రమాదాలు జరిగితే పటాన్‌చెరు, జీడిమెట్ల, నర్సాపూర్, బీహెచ్ఈఎల్‌ల నుంచి అగ్నిమాపక వాహనాలు రావాల్సి వస్తుంది. సుమారు 20 కిలోమీటర్ల దూరం నుంచి ఈ వాహనాలు వస్తుండటంతో జరగాల్సిన నష్టం జరిగిపోతుంది.

ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం

ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై యాజమాన్యాలకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం. ఎండాకాలంలో విధులు నిర్వర్తించే కార్మికుల రక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. యాజమాన్యాలు కూడా నిబంధనలు పాటించాలి. ఎండాకాలంలో అప్రమత్తత అవసరం.

– ప్రవీణ్ కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్

ఎండాకాలం జాగ్రత్త అవసరం..

ప్రస్తుతం ఎండలు దంచికొడుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది. ప్రతి ఏటా పారిశ్రామిక వాడల్లో 30 వరకు ప్రమాదాలు జరిగితే అందులో 20 వరకు వేసవిలోనే చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో యాజమాన్యాలు అప్రమత్తంగా ఉండి నిబంధనలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.

ఘనంగా సౌత్ ఇండియా ఐకాన్ అవార్డుల ప్రదానం

రాయదుర్గం: సౌత్ ఇండియా ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10 మందికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ-హబ్‌లో 'కమ్యూనిటీ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్', బ్లాగర్స్, ఇన్‌ఫ్లూయెన్సర్స్, యూట్యూబర్స్, న్యూ స్టార్టప్స్‌ల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా సోదరి ఆనమ్ మీర్జా ముఖ్య అతిథిగా హాజరై గిఫ్ట్ హ్యాంపర్లను పంపిణీ చేశారు. సాదియా కుర్షీద్, ప్రవీణ్, గుల్నార్ ఈవెంట్స్ ప్రతినిధి సుప్రియోచక్రబర్తి, బగ్గా, ఫుడ్‌బ్లాగర్ ఆయేషా జరీన్, ఖుక్కా నవాబ్, ట్రావెల్ బ్లాగర్ అమీర్ అహ్మద్, హీనాభాటియా, దస్‌పట్ రాజ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో బీఆర్‌ఎస్‌పై తగ్గని ఆదరణ

గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా



బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలతో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి

రాయదుర్గం: ప్రజల్లో బీఆర్‌ఎస్ పట్ల ఆదరణ తగ్గలేదని, అది మరింత పెరిగిందని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ కార్యాలయంలో రాయదుర్గంకు చెందిన పలువురు యువకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి బీఆర్‌ఎస్ పార్టీ కండువాలను కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ పట్ల యువత, మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. చేవెళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే గాంధీ నాయకత్వంలో అత్యధిక మెజార్టీ సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలు దీనికి సహకరించాలని ఆయన కోరారు.

దేవాలయాల నిర్మాణాలకు శంకుస్థాపనలు



జిన్నారం (పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పంచాయతీ పరిధిలో గల అల్లీనగర్‌లో గాలి పోచమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లి, కట్టమైసమ్మ తల్లి దేవాలయాలను నిర్మించేందుకు స్థానిక నాయకులు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. గ్రామస్తులు సహకారంతో నిర్మించేలా చర్యలు చేపడుతున్నట్లు నిర్మాణ నిర్వాహకులు వీరేశంగౌడ్ తదితరులు తెలిపారు.

ఘనంగా మైసమ్మ, ఎల్లమ్మ జాతర

జిన్నారం(పటాన్‌చెరు): రాయిన్‌చెరు వద్ద ఉన్న కట్టమైసమ్మ జాతర ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని పూజలకు హాజరైన నాయకులు ఆకాంక్షించారు. అలాగే మండలంలోని మాదారంలో ఆదివారం రేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మకు కల్యాణాన్ని జరిపారు. మాజీ సర్పంచ సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి జాతర ఉత్సవాలకు హాజరయ్యారు.

యువతి అదృశ్యం

గచ్చిబౌలి: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టీఎన్జీవోస్ కాలనీలో నివాసం ఉండే కె.శ్రీనివాసులు కుమార్తె శ్రావణ సంధ్య (19) స్థానికంగా ఓ సూపర్ మార్కెట్‌లో పనిచేస్తుంది. శనివారం ఉదయం 6 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సమీప ప్రాంతాల్లో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి అంకమ్మ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

హఫీజ్‌పేట్: రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన హఫీజ్‌పేట్, చందానగర్ రైల్వేస్టేషన్ల మధ్యలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి (32) హఫీజ్‌పేట్–చందానగర్ రైల్వేస్టేషన్ల మధ్యలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ట్రాక్‌పై దాటుతుండగా రైలు ఢీకొట్టగా.. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఒంటిపై తుల్సా అనే పచ్చబొట్టు ఉందన్నారు.

అభివృద్ధి చూసి గెలిపించండి

జిన్నారం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు చేస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో ఆదివారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూరీ జగన్నాథ స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

కారు గుర్తుకు ఓటు వేద్దాం

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఆదివారం మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వెంకటేశ్వరనగర్‌లో గడపగడపకు వెళ్లి కరపత్రం అందజేశారు. కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

దుస్తుల పంపిణీ

కూకట్‌పల్లి: హెల్పింగ్ హ్యూమన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ షేక్ మహమ్మద్ మగ్బూల్ జీహెచ్‌ఎంసీ కార్మికులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. భరత్‌నగర్ కాలనీలో 100 మంది మహిళలకు చీరలు, 25 మంది పురుషులకు ప్యాంటు, షర్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం తమ ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి ఉచితంగా దుస్తులు, ఆహారం అందజేస్తున్నామని పేర్కొన్నారు. నిత్యం ప్రజలకు సేవ చేస్తున్న జీహెచ్‌ఎంసీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి వారిని సన్మానించుకోవటం ఆనందంగా ఉందన్నారు.

ఐరా స్టూడియోస్ ప్రారంభం

మోతీనగర్: శ్రావ్య మానస భోగిరెడ్డి సారథ్యంలోని సుమధుర డాన్స్ అకాడమీకి అనుబంధంగా ఐరా స్టూడియోస్‌ను ఆదివారం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ప్రారంభించారు. అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. సినీ దర్శకుడు జేకే అన్వేషి ఫేమ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462